# రెండో రోజూ 'ఐటీ' దాడులు

- జమ్మికుంటలోని ఆదిత్య కాటన్ మిల్లు భాగస్వాముల ఆర్థిక లావాదేవీలపై ఆరా
- బ్యాంకు నుంచి పెద్ద మొత్తంలో నగదు విత్‌డ్రాలు.. స్థిరాస్తుల కొనుగోళ్లు.. రుణాలు, నగదు, బంగారం, వెండి నిల్వలు
- అకౌంట్ల నిర్వహణ.. తదితర అంశాలపై వ్యాపారులను ప్రశ్నించిన అధికారులు?
- రికార్డుల పరిశీలన
- క్రయవిక్రయాలపై లోతుగా విచారణ
- ఇళ్లల్లో ముగిసిన సోదాలు

జమ్మికుంట, నవంబర్ 22 : కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని కాటన్ వ్యాపార భాగస్వాములపై ఇన్‌కమ్ ట్యాక్స్(ఐటీ)శాఖ అధికారుల దాడులు బుధవారం రెండో రోజూ కొనసాగాయి. ఆదిత్య కాటన్ మిల్లు భాగస్వాముల ఆర్థిక లావాదేవీలపై ఆరా తీసినట్లు తెలిసింది. బ్యాంకుల్లో నుంచి పెద్ద మొత్తంలో నగదు, బదిలీలు, విత్‌డ్రాలు, స్థిరాస్తి కొనుగోళ్లు, రుణాలు, రైతులకు, వ్యాపారులకు చెల్లించిన, తీసుకున్న లావాదేవీలు, తదితర అంశాలపై ప్రశ్నించినట్లు సమాచారం. భూముల క్రయవిక్రయదారులను, రైతులను, వ్యాపారులను పిలిపించినట్లు తెలిసింది. కాటన్ క్రయవిక్రయాలపై రికార్డుల పరిశీలన, అకౌంట్ల నిర్వహణపై నిజానిజాలను లోతుగా విచారిస్తున్నట్లు సమాచారం.

**కేంద్ర బలగాల సిబ్బందితో సోదాలు**

పట్టణానికి చెందిన ప్రముఖ కాటన్ వ్యాపార భాగస్వాములు ముక్కా శివకుమార్, ముక్కా నారాయణ, బచ్చు భాస్కర్, తదితరుల మిల్లులు.. ఇళ్లపై కేంద్ర బలగాల సిబ్బంది బందోబస్తు మధ్య ఐటీ అధికారుల బృందం మంగళవారం ఉదయం నుంచి ఏకకాలంలో దాడులకు దిగిన సంగతి తెలిసిందే. ఆదిత్య మిల్లు, నారాయణ ఇంట్లో రాత్రి పొద్దుపోయేంత వరకు సోదాలు సాగాయి. సోదాల సమయంలో వ్యాపారులను, అకౌంటెంట్లను, వాళ్లవి, వాళ్ల బంధువుల సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలు చేశారు. అయితే, రాత్రి అధికారులు, యజమానులు, మిల్లు అకౌంటెంట్లు మిల్లుల్లోనే నిద్ర పోయినట్లు సమాచారం. అయితే, తనిఖీల్లో ముక్కా శివకుమార్, ముక్కా నారాయణ ఇళ్లలో జరిగిన సోదాల్లో లెక్కాపత్రాల్లేని నగదు, బంగారు, వెండి, తదితర వస్తువులు, స్థిరాస్తులు దొరికినట్లు సమాచారం. వాటిని స్వాధీనం చేసుకున్నారా..? సీజ్ చేశారా..? తెలియాల్సి ఉంది. అయితే, శివకుమార్ ఇంట్లో మంగళవారం మధ్యాహ్నం, జోగిపేట కాటన్ మిల్లులో సోదాలు ముగిసాయి.

**రెండో రోజూ తనిఖీలు**

రెండో రోజు ఉదయం 9 గంటల నుంచి ఆదిత్య కాటన్ మిల్లులో, నారాయణ ఇంట్లో బుధవారం ఐటీ అధికారులు తనిఖీ చేశారు. అయితే, నారాయణ ఇంట్లో సాయంత్రం నాలుగు గంటల వరకు సోదాలు ముగిసాయి. తర్వాత అధికారులు నేరుగా ఆదిత్య కాటన్ మిల్లుకు వెళ్లారు. పది మంది అధికారులు బ్యాంకు, మిల్లు రికార్డులను పరిశీలిస్తున్నారని తెలిసింది. రూ.లక్షలు, రూ.కోట్లల్లో జరిగిన ట్రాంజాక్షన్లపై ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా భారీగా నగదు అందించిన వ్యక్తులను పిలిపిస్తున్నట్లు తెలిసింది. ప్రతీ అంశాన్ని రికార్డు చేస్తున్నారని సమాచారం. స్థిరాస్తి ఎంతకు కొనుగోలు చేశారు? మార్కెట్ వ్యాల్యూ ఎంత? చెల్లించిందెంత?, వ్యాపారంలో అమ్మకాలు, కొనుగోళ్లు జరిపిన లావాదేవీలు.. నిజమైన రైతులు, వ్యాపారుల మధ్యనే లావాదేవీలు సాగాయా..? సదరు వ్యక్తుల వివరాలు ర్యాండమ్‌గా సేకరించినట్లు వినికిడి. అయితే, వ్యాపారులకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలన్నింటిపై ఒక్క ఆర్థిక సంవత్సరానికి సంబంధించినవే కాకుండా గతంలో జరిపిన ఆర్థిక లావాదేవీలు, వ్యాపారాలపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. సీసీఐ కుంభకోణం, బినామీ రైతులు, ఓ నాయకుడితో చెట్టాపట్టాలేసుకుని వ్యాపారాలు చేయడం, ప్రభుత్వ రంగ సంస్థ క్రయవిక్రయాల కొనుగోళ్లలో గోల్‌మాల్, పెద్ద నోట్ల రద్దు తర్వాత నగదు మార్పిడి, తదితర లావాదేవీలు బయటపడుతున్నాయని చర్చ సాగుతోంది. దీంతో వ్యాపారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని సమాచారం. ఐటీ అధికారుల విచారణలో మరికొందరి వ్యాపారుల పేర్లు కొత్తగా తెరమీదకు వస్తున్నాయని సర్వత్రా చర్చ జరుగుతోంది. గోల్‌మాల్‌తో సంబంధం ఉన్న వ్యాపారులు పరారైనట్లు తెలిసింది. అయితే, ప్రస్తుతం మిల్లులో ఐటీ సోదాలు ఇంకా సాగుతున్నాయి. రాత్రి వరకు పూర్తి కావచ్చని సమాచారం.

# చల్మెడను గెలిపించాల్సిన బాధ్యత మీదే

- అసెంబ్లీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



రుద్రవరంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

వేములవాడ రూరల్, నవంబర్ 22: చల్మెడను గెలిపించాల్సిన బాధ్యత మీదేనని, ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ఓటర్లకు వివరించాలని, ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సూచించారు. బుధవారం వేములవాడ మండలం రుద్రవరంలో పార్టీ మండల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతి ఓటరును కలి సి వేములవాడ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావును భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ క్యాడర్‌ను కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు అనుసరించాల్సిన వ్యూహాలను వినోద్‌కుమార్ వివరించారు. సమావేశంలో జడ్పీటీసీ మ్యాకల రవి, ఎంపీపీ బూర వజ్రవ్వబాబు, పార్టీ మండలాధ్యక్షుడు ఊరడి ప్రవీణ్, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఊరడి రాంరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణదేవరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అబద్ధాన్ని తిప్పి కొట్టండి

- అభివృద్ధిని ప్రజలకు వివరించండి
- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్ బాబు
- బీఆర్‌ఎస్ సోషల్ మీడియా వారియర్స్‌తో సమావేశం



వేములవాడలో మీడియా సోషల్ వారియర్స్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్ బాబు

వేములవాడ, నవంబర్ 22: కాంగ్రెస్, బీజేపీ నాయకులు సామాజిక మాధ్యమాల వేదికగా చెబుతున్న అబద్ధాలను ఎప్పటికప్పుడూ తిప్పికొడుతూ అభివృద్ధిని ప్రజలకు వివరించాలని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు అన్నారు. బుధవారం సంగీత నిలయంలో నియోజకవర్గస్థాయి బీఆర్‌ఎస్ సోషల్ మీడియా వారియర్స్‌తో ఆయన సమావేశమై మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా ప్రతిపక్షాల అబద్ధపు ప్రచారాలు, విమర్శలను ఎప్పటికప్పుడూ తిప్పికొడుతూ సరైన సమాధానం ఇవ్వాలన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా సోషల్ మీడియా వారియర్స్ పనితీరు బాగుందని వారిని ప్రశంసించారు. పదేండ్లలో వేములవాడ అభివృద్ధి, ప్రజలకు అందిన ఫలాలను వివరించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించి కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రతి సంక్షేమ పథకం లబ్ధిదారులకు అందిన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించినప్పుడే ప్రతిపక్షాలకు దీటైన జవాబు చేరుతుందని వారికి వివరించారు. సమావేశంలో మంద రాజేందర్, గుండెకార్ల నరేశ్, సందీప్ రెడ్డి, పసుల అంజీ, గుడిసె అరుణ్ కుమార్, రాజశేఖర్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

# చల్మెడకు బేడ బుడగ జంగాల మద్దతు

వేములవాడ రూరల్, నవంబర్ 22: వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన దాదాపు 50 మంది బేడ బుడగ జంగం నాయకులు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు మద్దతు తెలుపుతూ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని, మీరంతా కష్టపడి పనిచేయాలన్నారు. కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా, వేములవాడలో తనను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. పార్టీ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలన్నారు.

## ఈవీఎం కమిషనింగ్ పరిశీలించిన డీఈవో

కలెక్టరేట్, నవంబర్ 22 : ఈనెల 30న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో నగరంలోని ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహిస్తున్న కరీంనగర్, చొప్పదండి నియోజక వర్గాల ఈవీఎం, వీవీప్యాట్‌ల కమిషనింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కరీంనగర్ నియోజకవర్గానికి చెందిన 390 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి (రిజర్వుతో కలుపుకొని) 975 బ్యాలెట్ యూనిట్లు, 487 కంట్రోల్ యూనిట్లు, 546 వీవీ ప్యాట్‌లను 33 టెబుల్స్ ద్వారా, అదేవిధంగా చొప్పదండి నియోజక వర్గానికి చెందిన 327 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి (రిజర్వుతో కలుపుకొని) 408 బ్యాలెట్ యూనిట్లు, 408 కంట్రోల్ యూనిట్లు, 457 వీవీ ప్యాట్లను 31 టేబుల్స్ ద్వారా కమిషనింగ్ నిర్వహిస్తున్నారు. చొప్పదండి, కరీంనగర్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ప్రఫుల్ దేశాయ్, మహేశ్వర్, కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఈవీఎం కమిషన్‌ను పరిశీలిస్తున్న డీఈవో పమేలా సత్పతి

## పోలీసు స్పెషల్ యాక్షన్ టీంల ఫూట్ మార్చ్

రాంనగర్, నవంబర్ 22: ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా తీసుకునే ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు వీధుల్లో బుధవారం స్థానిక పోలీసులు స్పెషల్ యాక్షన్ టీంల ఆధ్వర్యంలో ఫూట్ మార్చ్, వాహన తనిఖీలు చేపట్టారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి ఆదేశాలతో గీతాభవన్ చౌరస్తా, ఉమెన్స్ డిగ్రీ కళాశాల, కశ్మీర్ గడ్డ, గోదాం గడ్డ, సప్తగిరికాలనీలోని పలు వీధుల్లో ఈ కార్యక్రమం నిర్వహించి పలు చోట్ల వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులను పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్, దర్పన్ అప్లికేషన్ ద్వారా తనిఖీలు చేశారు. గతంలో ఎన్నికల సమయంలో జరిగిన సంఘటనల ఆధారంగా సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాలుగా గుర్తించబడి, రాబోయే రోజుల్లో ఎన్నికల ప్రక్రియ ముగిసేంతవరకు శాంతి భద్రతలకు, ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే అవకాశం ఉన్నటువంటి పలు వీధుల్లో సమావేశాలు నిర్వహించి ప్రజల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్, టూ టౌన్ సీఐ రాంచందర్ రావు, హెడ్ క్వార్టర్ నుంచి స్పెషల్ యాక్షన్ టీంలు, స్థానిక పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

రాంనగర్, నవంబర్ 22: ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న ఓ వ్యక్తి కరీంనగర్ కోర్టు ప్రాంగణంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేయగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బోయినపల్లి మండలం శభాష్‌పల్లికి చెందిన నాయిని శ్రీనివాస్ రెడ్డి(40) కరీంనగర్‌లోని సప్తగిరికాలనీలో నివాసం ఉంటున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బుధవారం ఓ కేసు విషయమై శ్రీనివాస్ రెడ్డి కరీంనగర్ సబ్ కోర్టుకు వచ్చాడు. కాగా, కోర్టు ఆవరణలో పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేశాడు. కోర్టు సిబ్బంది సమీపంలోని ఓ దవాఖానకు తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు, మిత్రులకు సమాచారం అందించారు. వారు వచ్చి మెరుగైన చికిత్స కోసం మరో దవాఖానకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ విషయంపై కోర్టు సిబ్బంది కరీంనగర్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

# ప్రజా సంక్షేమానికి సర్కారు పెద్దపీట



ఎమ్మెల్యే రవిశంకర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న యువకులు

గంగాధర, నవంబర్ 22: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మండలంలోని గంగాధర, కొండన్నపల్లి గ్రామాలకు చెందిన పలువురు యువకులు బుధవారం ఎమ్మెల్యే రవిశంకర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కాగా మండలంలోని మధురానగర్‌లో కండువాలు కప్పి యువకులను పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, కొండగట్టు డైరెక్టర్ ఉప్పుల గంగాధర్, సర్పంచులు వేముల లావణ్యఅంజి, మడ్లపెల్లి గంగాధర్, కంకణాల విజేందర్‌రెడ్డి, వేముల దామోదర్, ఉపసర్పంచ్ నిమ్మనవేణి ప్రభాకర్, నాయకులు మడ్లపెల్లి శ్రీనివాస్, తూము తిరుపతి, గంగాధర శ్రీకాంత్, రుద్రాక్ష హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.